‘జగనన్న సురక్ష’తో సత్వర మేలు

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- 55వ వార్డులో లబ్ధిదారులకు 931 ధ్రువపత్రాల అందజేత

కంచరపాలెం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్ శివాలయం ఆవరణలో బుధవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పరిపాలనను తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఏం కావాలో అడిగి తెలుసుకుని.. వాటిని సంపూర్ణంగా అందించడమే లక్ష్యంగా నెల రోజుల పాటు జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలు అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు.

సచివాలయాల వారీగా లబ్ధిదారులు పొందిన ధ్రువపత్రాలు

సచివాలయ ప్రాంతం, నంబర్		సర్టిఫికెట్లు
ధర్మానగర్	21086250	215
జోగారావునగర్	21086261	123
రెడ్డికంచరపాలెం	21086262	190
జాషువానగర్	21086268	205
తిక్కవానిపాలెం	21086269	198


చిన్నారికి కుల ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ శశికళ

లబ్ధిదారుల ఆనందం..

భారీ వర్షంలోనూ నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పలు రకాల సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు, ఉచితంగా సేవలు అందించడం జగనన్న పాలనకు నిదర్శనమని కొనియాడారు. వార్డులోని 21086250, 261, 262, 268, 269 సచివాలయాల పరిధిలో 1,012 దరఖాస్తులు రాగా.. 931 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు ఏపీడీ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రత్నాకర్, శ్రీనివాసరావు, అమర్‌రెడ్డి, గంగా మహేష్, సిద్ధార్థరాజు, శ్రీను, బద్రి, గోపి, గౌష్, సురేష్, నాగ, లక్ష్మి, సంతోష్, సోమేష్, దివాకర్‌రెడ్డి, పద్మా, శివప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే కుల, ఆదాయ ధ్రువపత్రాలు



కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. క్యాస్ట్ సర్టిఫికెట్ లేకపోవడంతో నా పిల్లల చదువుకు చాలా ఇబ్బంది కలిగేది. జగనన్న సురక్ష క్యాంపులో దరఖాస్తు చేశాను. రెండు రోజుల్లోనే వాటిని అందించారు. ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత సాధించాను. చాలా ఆనందంగా ఉంది.

– దుంప రామలక్ష్మి, రెడ్డికంచరపాలెం

ప్రతి గడపకూ సంక్షేమం

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు 288 సచివాలయం పరిధి వంశీనగర్ వాటర్ ట్యాంక్ ప్రాంతంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా బడికి వెళ్లే చిన్నారుల నుంచి 60 ఏళ్లు దాటిన వృద్ధుల వరకు అందరి కోసం సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. భవిష్యత్తులో ప్రజలందరూ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రసూనారెడ్డి, 50వ వార్డు నాయకులు భగాతి విజయ్, కృష్ణారావు మాస్టర్, ఏవీఎస్ రాజు, సనపల నారాయణస్వామి, సన్యాసిరావు, నారాయణరావు, త్రినాథ్, సీపాన రాము, పొన్నాడ అప్పారావు మాస్టర్, శ్రీనివాసరాజు, ప్రసన్న, శివాజీ, జగదీష్, అప్పారావు, సీనియర్ నాయకులు పైడి ప్రతాప్, ఎం.సునీల్, అమర్‌రెడ్డి, రత్నం, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ప్రసాద్

లలితాదేవి అవతారాలపై ప్రవచనం

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో ప్రతి రోజూ సాయంత్రం శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమం జరుగుతోంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని లలితాదేవి అవతార విశేషాల గురించి ప్రవచించారు. లలితాదేవి ఆవిర్భావం, అమ్మవారు ఎలా దుష్టశిక్షణ చేసి తన బిడ్డలను రక్షించిన విధానాన్ని వివరించారు. అమ్మవారి సేవలోనే వివిధ దేవతలను ఎలా ఉపాసించాలో, వారి ఉపాసన ద్వారా ఎటువంటి ఫలితాలు పొందవచ్చో భక్తులకు తెలియజేశారు. అనంతరం భక్తులకు మాతాజీ చేతుల మీదు ప్రసాదం అందజేశారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరనాంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లలితా పారాయణ చేసారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ప్రవచిస్తున్న మాతా రమ్యానంద భారతి

క్లుప్తంగా

పిల్లలు, గర్భిణులకు టీకాలు


చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్‌ఎంలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం ఈశ్వరి మాట్లాడుతూ ప్రతి రెండో బుధవారం, శనివారం వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల నుంచి 16 ఏళ్ల వయసు గల వారికి వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. గర్భిణులకు మూడో నెలలో ఒక సారి, నాల్గో నెలలో ఒక సారి డోస్ వేస్తామని, పిల్లలకు పోలియో, పచ్చకామర్లు, మెదడవాపు వ్యాధి, విరోచనాలు, వాంతులు రాకుండా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. రేసపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మొదటి, మూడో బుధవారాలు వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మరో ఏఎన్‌ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ గౌరి పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం సందర్శన


రిసోర్స్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీనియర్ డీపీవో రంజన్ మహంతి

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలో జాతీయ రహదారి పక్కన పోర్ట్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌ను బుధవారం ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి సందర్శించారు. ప్రైమరీ స్కూల్‌లోని రిసోర్స్ రూమ్‌ను, విద్యార్థులకు బోధనలో ఉపయోగపడే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. దీనిని తయారుచేసిన పిల్లలను, టీచర్లను ఆయన అభినందించారు. అనంతరం బాలవాటిక టీచర్ ఇంటర్వ్యూ సెలక్షన్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్ కమల్‌జీత్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం వి.ఎం.శైలజ, సీనియర్ టీచర్ ఎం.రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై మాజీ సైనికులకు అవగాహన


మాట్లాడుతున్న ఉపాధి అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో మాజీ సైనికులకు ప్రైవేటు ఆర్గనైజేషన్‌లో ఉపాధి–స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఉపాధి కార్యాలయ అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివిధ పరిశ్రమల్లో ఉపాధి పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ ట్రేడుల్లో అవకాశాలు, నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంఘాల సభ్యులు, పలు పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు 31 వరకు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ–చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జరిగే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 31 వరకు గడుపు పెంచారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశికలకు అపరాధ రుసుం లేకుండా, హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్రభాష విశారధ ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు రూ.10 అపరాధ రుసుంతో ఈ ఫీజులు చెల్లించవచ్చు. ఈ పరీక్షలకు భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌ను కేంద్రంగా ఎంపిక చేశారు. పూర్తి వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలి.

ఏఎస్సార్ నగర్‌వాసులకు కె.కె.రాజు భరోసా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం ఏఎస్సార్ నగర్‌లో బుధవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర కె.కె.రాజు పర్యటించారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతంలో తాత్కాలిక గుడారాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నివాసులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు భారీగా కురుస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇక్కడ నివసిస్తున్న పలు పేద కుటుంబాలకు వర్షాలు తగ్గే వరకు భోజన సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు కె.కె.రాజు సూచించారు. పర్యటనలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, యూసీడీ పీడీ పాపునాయుడు, సీతమ్మధార డిప్యూటీ తహసీల్దార్ త్రినాథరావు, వీఆర్వో నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు తిరుపతి, సన్నీ, నాయుడు, గణపతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఏఎస్సార్ నగర్‌వాసుల తాత్కాలిక నివాసాలను పరిశీలిస్తున్న కె.కె.రాజు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మురళీనగర్, సెక్టార్–5, బాలభాను పాఠశాల ఏరియా, బర్మా కాలనీ, మసీదు రోడ్డు, వర్మా కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహిస్తారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

ఎరుకుమాంబకు జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు


ఆలయం వద్ద భక్తుల రద్దీ

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు భక్తులు పసుపునీళ్లతో బారులు తీరారు. అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతోపాటు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం జరిపారు. దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూ బజారు, నరసింహనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఎరుకుమాంబను పసుపు, కుంకుమలు, పలు రకాల పూలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ సిబ్బంది అందించారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.16.24 లక్షలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల ఆదాయం లెక్కించారు. 46 రోజులకు గాను అమ్మవారి దర్శనాలకు సంబంధించి రూ.16,24,024 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రీ దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది షేక్ హజరుద్దీన్, లక్ష్మీనారాయణ, ఇందిరారాణి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డిపాజిట్ సొమ్ము మాయంపై ఫిర్యాదు

మద్రిపాలెం: కంచరపాలెం పరిధిలో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి డిపాజిట్ నగదును సొంత ఖాతాలోకి వేసుకుని మోసం చేసిన ఘటన జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాంకుమార్ అనే వ్యక్తి ఖాతాదారులు డిపాజిట్ చేసిన సొమ్మును తీసుకుని వారికి రసీదులు అందించారు. పోస్టాఫీస్‌లో ఆ నగదును జమ చేయకుండా సొంత ఖాతాలోకి వేసుకున్నాడు. నగదు లెక్కలు సరిచూసుకున్న అధికారులు రూ.6 లక్షల 4 వేల తేడా రావడంతో ఉలిక్కి పడ్డారు. దీంతో వెంటనే కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఏయూ క్యాంపస్: ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏపీ ర్యాగింగ్ నిషేధ చట్టం 1997 గురించి విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలను తెలియజేశారు. అదే విధంగా యువత వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మోటారు వాహన చట్టాలు, తాజాగా వచ్చిన మార్పులు వివరించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాము మాట్లాడుతూ నగరంలో ర్యాంగింగ్, మత్తు పదార్థాలకు సంబంధించి గతంలో నమోదైన కేసులు, పర్యవసానాలు వివరించారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉంటూ తమ ఉన్నత భవిష్యత్‌ని పదిలం చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఏయూ ఇంజినీరింగ్ కళాశాలను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దామన్నారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడం, నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎ.ప్రసాద్, ఆచార్య ఎస్.పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట శేషమ్మ

గుర్తింపు లేని పాఠశాలలపై దృష్టి పెట్టండి

ఎంవీపీ కాలనీ: ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై దృష్టిసారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం జిల్లా అధికారులకు సూచించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్న రాల్లా బెల్లా స్కూల్‌ను బుధవారం ఆయన జిల్లా డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి రామారావు, జిల్లా శిశు సంక్షేమాధికారులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి సందర్శించారు. గత కొంతకాలంగా అనుమతులు తీసుకోకుండా రాల్లా బెల్లా స్కూల్ 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్న తీరును విద్యార్థుల తల్లిదండ్రులు ఆధారాలతో సహా సీతారాంకు వివరించారు. దీంతో పాఠశాల ప్రతినిధుల నుంచి స్కూల్ గుర్తింపు పత్రాలపై ఆరాతీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా 8, 9, 10 తరగతులు ఎలా నిర్వహిస్తున్నారని పాఠశాల యాజమాన్య ప్రతినిధులను ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ డీఈవో, ఎంఈవో మాట్లాడుతూ అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలా విద్యార్థులకు అందించిన ధ్రువపత్రాలు చెల్లవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సీతారాం జిల్లా అధికారులకు సిఫార్సు చేశారు. విద్యార్థుల భవిష్యత్‌కు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారి వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


రాల్లా బెల్లా పాఠశాల గుర్తింపుపై ఆరా తీస్తున్న గొండు సీతారాం

చంద్రపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ముందడుగు


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: జోన్–5 మధురవాడ చంద్రపాలెం ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులపై బుధవారం సీతమ్మధారలోని తన నివాసంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జాతీయ రహదారుల అధికారులతో చర్చించారు. హైవే పక్కనే ఉన్న చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు విద్యార్థులు వచ్చి, వెళ్లేటప్పుడు తరుచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్ అంజన్‌కు వినతిపత్రం ద్వారా ఎమ్మెల్యే సూచించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారు.

కూలిన చెట్ల తొలగింపు

సీతమ్మధార: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. వాటిని బుధవారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు. సీతమ్మధార ప్రధాన రహదారిలో రెండు చోట్ల కొమ్మలు పడి పోవడంతో వాహన చోదకులు, పాదచారులకు ఇబ్బంది పడ్డారు. మొత్తం ఆ ప్రాంత ంలో ఉన్న చెట్టు కొమ్మలను తరలించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు


టింపనీ స్కూల్ ‘ఏ’ గేటు వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు

సీతంపేట: సీబీఎం కాంపౌండ్ టింపనీ స్కూల్ ‘ఏ’ గేటు వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలి.

– ఎస్.హేమంత్‌కుమార్, సీబీఎం కాంపౌండ్

మురుగు నీటితో దుర్వాసన


నక్కవానిపాలెం పైప్ విరిగి లీకవుతున్న మురుగు నీరు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం శివాలయం వీధి రోడ్డులో పైప్ లీకవడంతో కాలువల్లో మురుగు, మరుగుదొడ్ల నీరు ప్రవహిస్తోంది. దాని దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

– ఎస్.కృష్ణ, నక్కవానిపాలెం

వీర జవాన్లకు ఘన నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

బీచ్ రోడ్డు: కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లకు సాగరతీరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. కార్గిల్ దివాస్ సందర్భంగా ఆల్ ఇండియా ఎక్స్ సర్వీసు బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఈ ర్యాలీ సాగింది.

రహదారులు జలమయం

సీతమ్మధార: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయమవుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం పడిన వర్షానికి డైమండ్ పార్కు, రైల్వే న్యూకాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలమెట్ట తదితర ప్రాంతాల్లోని రోడ్లపై వర్షపు నీరు భారీగా చేరింది. శ్రీకన్య థియేటర్ వద్ద రహదారిపై పార్క్‌చేసి ఉన్న ద్విచక్ర వాహనాలు నీటిలో మునిగిపోయాయి. మరికొన్ని కొట్టుకుపోయాయి.

విక్టోరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

మహారాణిపేట: ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆస్పత్రి అభివృద్ధికి వైజాగ్ రౌండ్ టేబుల్ ఎంతో సహకరిస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, వైజాగ్ రౌండ్ టేబుల్ 77 చైర్మన్ ఎం.తేజ, వైజాగ్ లైడీస్ సర్కిల్ 201 అధ్యక్షురాలు శ్వేత జోష్ తెలిపారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఉష మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికారాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రసూతి వైద్యానికి అవసరమైన మందులు, సిబ్బందిని అందించడంలో అధికార యంత్రాంగం సహకరిస్తుందని తెలిపారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జి. మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది వైజాగ్ రౌండ్ టేబుల్ 77 అయిదు సంవత్సరాల పాటు ఆస్పత్రి కోసం ఏడాదికి రూ. 30 లక్షలు విరాళంగా ఇస్తామని ప్రకటించిందని అన్నారు. ఈ ఏడాది ల్యాప్రోస్కోప్‌ను ఆస్పత్రికి ఇస్తామని హామీ ఇచ్చారని వివరించారు. వైజాగ్ రౌండ్ టేబుల్ 77 చైర్మన్ ఎం.తేజ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ఎలాంటి సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో క్లినికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.అనురాధ, ప్రొఫెసర్లు డాక్టర్ గీత వందన, ఆర్.విద్యారమా, వైజాగ్ రౌండ్ టేబుల్ 77 హెచ్‌ఆర్ సంతోష్‌కుమార్, వైజాగ్ లైడీస్ సర్కిల్ 201 నాయకురాళ్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.